# గులాబి

"నువ్వొకసారి వస్తావా?" గోమతి ఫోన్. "అన్నం తిని, నిద్రపోయి, నిద్రలేచి వస్తాను" అన్నాను. "నేను పెడతాను అన్నం. మా ఇంట్లోనే నిద్రపోదువుగాని రా!" అన్నది.

"ఏమిటంత అర్జంటు?" ఫోన్‌లో చెప్పరాదూ?" అన్నాను. ఒక్కక్షణం నిశ్శబ్దం.

"చాలా సీరియస్. నువ్వు తప్పితే చెప్పుకోవడానికి ఎవరూ లేరు. రావా?" అన్నది. ఆమె కంఠంలో వణుకు వుందా అనిపించింది.

"సరే వస్తాను." అన్నాను. ఏమై వుంటుందని ఒక ఆందోళన నాకు.

గోమతి నేనూ పాతికేళ్ళుగా స్నేహితులం. అంతకు మునుపు స్కూల్లో, కాలేజీలో, చిన్ననాడూ కలిసి చదువుకున్న పరిచయం. కానీ, పాతికేళ్ళుగా ఒకే ఊరిలో వుండబట్టి స్నేహం దట్టమైంది. రెండ్రోజులకు ఒక్కసారైనా మాట్లాడుకుంటాము. తన ప్రతి విషయం నాతో చెప్పుకుంటుంది. వాళ్ళాయనది పెద్ద బిజినెస్. రెండు కార్లు, బంగళా, కుక్క – పెద్ద కాపురం ఆమెది. ఇంకా నాదే చిన్న సంసారం అని చెప్పవచ్చు.

ఎప్పుడూ సంతోషంగా ఉండే మనిషి, ఎందుకు కలవరపడుతోందో అనుకున్నాను. ఆటో దిగి ఇంట్లోకి వెళ్ళాను. ఇల్లంతా నిశ్శబ్దం. టీవీ కూడా మోగడం లేదు.

"రావే! లోపల కూర్చుందాం" అన్నది.

"ఏమైందే?" అన్నాను నిజంగా ఖంగారుపడుతూ.

"సుమ సంగతి" అన్నది.

ఇంక మాటరాక, కళ్ళల్లో నీరు తిరిగిపోయి, గొంతులోంచి దుఃఖం పెగిలి వచ్చి ఏడ్చేసింది.

"అరే, ఏమిటది?" అన్నాను వీపు నిమురుతూ.

"సుమ.. సుమ... పాడు పని చేసిందే" అన్నది. సుమ ఒక్కగానొక్క కూతురు. బి.ఏ. చదువుతోంది. "ఏం చేసిందే?" అన్నాను బెంబేలు పడుతూ.

"అదీ... అది... యిప్పుడు మూడోనెల" అన్నది గోమతి.

మూడో నెలా! ఎలా, ఎవరు, ఎప్పుడు అన్న ప్రశ్నలు.

"ఇప్పుడెక్కడుంది? ఏం చేస్తోంది?"

"గదిలో వుంది. ఏడుస్తోంది" అన్నది.

"పద. అక్కడికే" అన్నాను బ్యాగు పుచ్చుకొని లేస్తూ.

చక్కగా అలంకరించిన పెద్ద గది. పెద్ద మంచం. అందమైన కర్టెన్లు, దుప్పట్లు, మేము వెళ్ళగానే అది లేచి కూర్చుంది. సుమ అలిసిపోయి పాలిపోయిన చెక్కిళ్ళతో, ఉబ్బిన కళ్ళతో, అదుపుకాని జుట్టుతో, ఎలా వుందని చెప్పను ఆ పిల్ల ఆకారం! జుట్టు వెనక్కి తోసుకొని లేచి నిలబడింది.

"కూర్చో సుమా!" మేమిద్దరం మంచం మీద కూర్చున్నాం. తనూ కూర్చుంది. ఉబికి వస్తున్న కన్నీటిని చేతులతో తుడుచుకుంటూ, కిందికి చూస్తూ మోకాళ్ళమీద తలపెట్టుకుంది.

"ఎలా జరిగింది సుమా?" అన్నాను నేను సూటిగా విషయంలోకి వెళ్ళిపోతూ.

తల్లి వంక బిత్తరగా చూసింది సుమ.

"యూత్ ఫెస్టివల్ అని వెళ్ళింది మూణ్ణెళ్ళ క్రితం. అక్కడే ఎవరో కాశ్మీర్ కుర్రాడట - యీ పని చేశాడు. దౌర్భాగ్యపు వెధవ. ఐనా మనకి కళ్ళు మూసుకొని పోతే వాడికి అలుసేగా? ఎవరికి వాళ్ళకి బుద్ధి వుండాలి. 'దానికి ఏ అడ్డూ చెప్పకు. స్వేచ్ఛ యిప్పుడు కాకపోతే ఎప్పుడు? నా బిడ్డల మీద నాకు నమ్మకం అంటారు. వీళ్ళ నాన్న. ఇప్పుడేమయింది? చెప్పవే, చెప్పు" అంది గోమతి కసిగా, కోపంగా.

"ఏం చెబుతుందిలే - ఆ అబ్బాయెవరు సుమా? నిన్ను ప్రేమించాడా?" అన్నాను మృదువుగా.

"ప్రేమా, పాడా? అందరూ తైతక్కలాడతారుగా - వాడికేముంది మగవాడు. ఇంక మర్చిపో వాడిని - దీని సంగతి ఏం చేయాలా అని యిప్పుడు" అన్నది మళ్ళీ గోమతి.

"అసలు నిజంగా ఏమైనా వుందో లేదో..." అని నేను అంటుండగానే..

"తల్లీ! పొద్దునే డాక్టర్ ఆయేషా దగ్గరికి తీసుకెళ్ళాను. కచ్చితంగా చెప్పింది. ఇప్పుడేం చేయనే! వాళ్ళ నాన్నకింకా తెలియదు. ఊరికెళ్ళారు"

"పండుకి తెలుసా?" అడిగాను. పండు అంటే సుమ అన్న. బి.టెక్. చదువుతున్నాడు.

"లేదు. వాడో అయోమయం. ఏదో గొడవ పడుతున్నానుకున్నాడు. కానీ టైమైందని వెళ్ళిపోయాడు పొద్దున్న" అన్నది గోమతి.

"ఏం చేద్దామని నీ ఉద్దేశ్యం? సుమా! నువ్వు ఏమంటావు? నిజంగా విచారకరం. యిల్లా జరగడం. జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి" అన్నాను.

గోమతి నా వంక ఆశ్చర్యంగా చూసింది.

"ఆలోచించడమేముందే? తీయించేస్తాను. ఆయేషా చేతుల మీదుగానే. కొన్నాళ్ళు విశ్రాంతి. మళ్ళీ కాలేజీకి వెడుతుంది. నువ్వు దగ్గరిదానవు కదా! ఓ ముక్క నీతోనైనా చెప్పి చేద్దామనుకున్నా.!!

"అబార్షనా" అన్నాను నేను నీరసంగా.

"కాకపోతే మోస్తుందా-కంటుందా, పెంచుతుందా" అన్నది వెటకారంగా గోమతి.

నాకు కష్టమనిపించింది. కన్నకూతురిని అంత అపహాస్యం చేస్తోంటే.

"గోమతి! తన యిష్టమేమిటో కనుక్కోరాదు? సుమా, చెప్పమ్మా, నీ మనసులో ఏముందో. చాలా బాధగా వుందా యిల్లా జరిగినందుకు? క్షణికమైన ఆవేశం వల్ల ఎంత పని జరిగిందని వాపోతున్నావా? చెప్పమ్మా" అన్నాను ఆమె చేతి మీద చేయి వేసి.

"ఔను పెద్దమ్మా, నాకూ అర్థం కావడం లేదు. అమ్మ చెప్పినట్టే వింటాను" అన్నది సుమ.

"ఆరోగ్యం బాగుందా? వాంతులూ అదీ ఏమీ లేవు కదా! మనస్సు ఎలా వుంది?" అన్నాను నేను మళ్ళీ.

"ఏం లేదు పెద్దమ్మా! మామూలుగానే వున్నాను. ఇటీజ్ ఎ బయలాజికల్ ప్రాబ్లం" అన్నది.

నేను విస్తుపోయాను.

ఒక ప్రాణిని వుంచడమా, చంపడమా అన్నది బయలాజికల్ ప్రాబ్లమా?

"అల్లాగైతే దాన్ని అలాగే వుండనివ్వు – ఎందుకు గోల పెడతావు?"

"ఎల్లా? పెరుగుతుంది, నలుగురికీ ఏం చెప్పాలి? ఎవరు దీన్ని పెళ్ళి చేసుకుంటారు?" అన్నది గోమతి చాలా దిగులు ఆమె మాటల్లో, "అందుకనే తీయించేస్తా" అన్నది.

నేను అప్రయత్నంగా "భ్రూణహత్యా" అన్నాను. నా సంస్కారాన్ని బట్టి అదెంతో నికృష్టమైన పని.

"అంటే ఏమిటి పెద్దమ్మా!" అన్నది సుమ కళ్ళు పెద్దవి చేస్తూ.

"అంటే కడుపులోని ఫీటస్‌ని చంపటం" అని చెప్పాను.

ఎవరిదో జీవితంలాగా యీ విషయం చర్చించటం నాకు ఘోరంగా అనిపించసాగింది.

"భ్రూణహత్యా, సింగినాదమా! సంస్కృతంలో ఏదో పేరు పెడితే అంత భయంకరంగా వినిపిస్తున్నది–ఇంతకీ నువ్వు అన్నం తిన్నావా?" అన్నది గోమతి.

"తిన్నాను. మీరింకా భోంచేసినట్లు లేరుగా" అన్నాను.

"లేదే! ఈ గొడవతోనే మతులు పోయి కొట్టుకుంటున్నాం" అన్నది.

"భలేవాళ్ళే! సుమకి నీరసం రాదూ? ఉండు, నేను పెడతాను" అని వంటింట్లోకి వెళ్ళి వండినవి ఏమిటో చూసి, టేబుల్ మీదకి చేరవేశాను.

"రా అమ్మా! ముందు అన్నం తిను. ఆ తర్వాత ఆలోచిద్దాం!"

ఆవురావురుమంటూ ఆ పిల్ల తింటోంటే నాకు జాలి వేసింది. లేత మొగ్గ వాడిపోయింది. పెద్ద సమస్య వచ్చి పడింది. నిండా ఇరవై ఏళ్ళు లేని ఆ బతుక్కు యింకో ప్రాణి తోడు.

కానీ గోమతి ఆలోచనే నాకు ఏవగింపు కలిగిస్తోంది. ఏదో అయింది. ఫలితం అనుభవించకపోతే ఎలా? ఎదుర్కొనే ధైర్యం తనకి వుండాలి. తల్లిగా ఆ పిల్లకు సరైన సలహా యివ్వాలి.

"చూడు గోమతీ! దాని కడుపులో వూపిరి పోసుకుంటూ కొట్టుమిట్టాడుతున్న ప్రాణాన్ని చంపేయాలన్న అంత దుష్టమైన ఆలోచన నీకెందుకే? బిడ్డను కననీ –ఎవరికైనా యిచ్చేయనీ!" అన్నాను నింపాదిగా కూర్చున్నాక.

"ఛా–దానికి అంత భారం ఎందుకే. ఆడుకుంటూ, పాడుకుంటూ వుండవలసిన పిల్ల యింత కడుపుతో, అందులోనూ ఎవరో దిక్కుమాలిన వాడు చేసిన పనితో ఆ పాపభారం మోస్తూ ప్రతిక్షణం ఎందుకు వచ్చిన తద్దినం యిది అని కుమిలి పోవాలా? నాన్సెన్సు, నేను వప్పను" అన్నది.

"సరే, అయితే నన్ను సలహాకి ఎందుకు పిల్చావు? నేను వెళ్ళి వస్తాను" అని లేచాను.

గోమతి ఒక్కక్షణం ఆలోచించింది.

"కూచో – ఏమిటా తొందర? అయితే ఏం చేద్దామంటావు?" అన్నది.

"సుమని మీ చెల్లెలి దగ్గరకి బొంబాయి పంపించేయి. వాళ్ళు పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. నువ్వెళ్ళి అంతా చెప్పి, దింపిరా. ఇంకా ఐదారునెలలు – ఎంతలో తిరిగివస్తాయి. బిడ్డను కన్నాక ఏం

చేయాలో ఆలోచిద్దాం. దాన్ని వెతుక్కుంటూ మాతృత్వం వచ్చింది. అదొక అనుభవం. అలా మీ నుంచి విడివడి వుండడంతో తనకీ ఒక నిండుదనం వస్తుంది. జీవితమంటే ఏమిటో తెలుస్తుంది. కొందరు, కొందరికి చిన్న వయస్సులోనే అనుభవాలు ఎదురౌతాయి. ఆ అనుభవంలో అది కాగి, వేగి, మసలి, ఒక పరిణతి పొందుతుంది. పిరికిదానిలా పారిపోనివ్వకు.లేతవయస్సులో ఎబార్షన్ చేయిస్తే ఆ మచ్చ శరీరం మీద, మనస్సు మీద వుండక మానదు. నా మాట విను. ధైర్యంగా ఎదుర్కోనీ జీవితాన్ని."





పరిశీలనగా కూతుర్ని చూస్తోంది గోమతి. పాలుగారే బుగ్గలు, చిన్నగా వంగిపోయిన భుజాలు, రెప్పల కింద కళ్ళల్లో తెలియని అయోమయం ఆలోచనలు.

మేము మాట్లాడుకునేది తనని గురించే అయినా, ఎవరిని గురించో అన్నట్లు వింటోంది.

"తన కడుపులో ఆశ్రయం వెతుక్కుంటూ వచ్చిన పసి ప్రాణాన్ని చిదిమి, ఛిద్రం చేయాలన్న ఆలోచన నాకు ఎంతో హృదయ విదారకంగా వుంది. అదే పసిబిడ్డ...దానికి యింకో బిడ్డ. నీకంత కష్టం వచ్చింది గోమతీ!" అన్నాను నేను నిజంగానే జాలిపడుతూ.

గోమతి ఆలోచిస్తోంది. సుమ దీనంగా కూర్చుంది. కునికి పాట్లు పడుతోంది.

"తొందరేం లేదు ఆలోచించు! మీవారు రేపు వచ్చాక ఆలోచించు! అనుక్షణం దాని శ్వాసగా తిరుగుతున్న ఆ బిడ్డను గురించి కరుణతో ఆలోచించు. నేను రేపు వస్తాను. సుమా! ఆ గదిలో పడుకుందువు గాని రాతల్లీ!" అని తనని పొదువుకొని తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టాను.

గోమతీ, నేను ఆ తర్వాత చాలా సేపు మాట్లాడుకున్నాం. నా అభిప్రాయాన్ని యింకా, యింకా తన తలలోకి ఎక్కించడానికి ప్రయత్నించాను. నేను మాట్లాడి, మాట్లాడి అలసిపోయాను. వెడతానని బయలుదేరాను. డ్రైవర్‌ని కేకేసి నన్ను దింపి రమ్మని చెప్పింది గోమతి.

ఒకరోజు ఆగి ఫోన్ చేశాను గోమతికి. "ఏం నిర్ణయించుకున్నారు? అని. వెంటనే నేను అతిగా కల్పించుకుంటున్నానా అని అనుమానం వచ్చింది. "అంటే, వూరికే అడిగాను, కానీ, నేను కలుగ చేసుకోవడం తప్పుకదా!" అన్నాను.

"లేదు జానకీ! నీ సలహా మా వారికి కూడా సరైనదే అనిపించింది. సుమ కూడా వప్పుకుంది. కానీ భయపడుతోంది. మా చెల్లెలితో బొంబాయిలో మాట్లాడాను. తను సరే అంది. నాలుగోనెల రాగానే నేను వెళ్ళి దింపి వస్తాను" అన్నది. అంత తేలిగ్గా యీ విషయంలో అంగీకారం కుదురుందని అనుకోలేదు. గోమతి ఎంత చురుకు. పుట్టబోయే శిశువు అదృష్టం బాగుంది.

"సుమ మనస్సు ఎలా వుంటుందోనని భయపడ్డాను. కలవరం, జీవితం ఏదో దారి పట్టిందన్న వేదన, పాపం దానికి బాగా సర్ది చెప్పవే! ఒక్క ఆరేడు నెలలు ఓపిక పడితే వదిలిపోతుంది. తర్వాత సంగతి ఆలోచిద్దాం" అన్నాను.

వాళ్ళు బొంబాయి వెళ్ళే రోజు కూడా నేను వెళ్ళి వస్తువులు, బట్టలు సర్దిపెట్టి మనుష్యలకి సర్ది చెప్పాను.

"సుమా! నువ్వు చేస్తున్నది చాలా గొప్ప త్యాగం. మనిషిగా నువ్వెంత ఉన్నతంగా ఎదిగిపోయావో అర్థం చేసుకో!" అన్నాను. తల వూపింది. చక్కని చుక్క మంచి డ్రెస్సులో మెరిసిపోతోంది. బిడ్డను మోస్తున్న ఆ వెలుగు నాకు మాత్రమే కనబడిందా? ఏమో!

బొంబాయిలో దింపి పదిరోజులుండి వచ్చింది గోమతి. ఫోన్‌లో రోజూ మాట్లాడుకునేవాళ్ళం. కాలేజీ ఎటు పోయిందో ఎవరికీ ఆలోచన ఉన్నట్లు లేదు. ఐదు, ఆరు, ఎనిమిది నెలలు గడిచి పోయాయి. గోమతి వాళ్ళాయన బొంబాయి వెళ్ళి వస్తూనే వున్నారు.

"సుమ ఎంత బాగుందో! నాదిష్టే తగిలేటట్లు వుంది" అన్నది ఓసారి గోమతి. నాకు టెన్షన్‌గానే వుంది. ఒడ్డున కూర్చుని సలహా యిచ్చాను. అనుభవించేవారికి తెలుస్తుంది అన్న విషయమూ నేను మరిచిపోరాదు. పెద్ద పెద్ద వుత్తరాలు వ్రాశాను సుమకి - తెలుగు, ఇంగ్లీషు కలగలిపి.

తొమ్మిది నెలలు వెళ్ళిపోయాయి. గోమతి వెళ్ళింది మళ్ళీ 'అమ్మాయి పుట్టింది' అన్న వార్త నాకు ఫోన్‌లో చెప్పినప్పుడు నా మనస్సు ఏదో తెలియని ఆవేశానికి లోనైంది. పాపకి పాలిస్తుందా, మమకారం పెరిగిపోతుందా-సుమ ఎంత బాధపడిందో, అని నాకు ఆరాటం. బొంబాయి వెడదామనుకున్నాను. కానీ, మరీ అంత ప్రమేయం పనికిరాదని వుండిపోయాను.

మరో రెండు నెలలకి సుమ వచ్చేసింది. పాపను వదిలేసి. గోమతి చెల్లెలు చూసుకుంటానందిట. 'శిశువిహార్'కి యిచ్చేయమని ఎవరో అంటే గోమతికి మనస్సు వప్పలేదట.

సుమ దిగులుగా వుంది. కళ్ళల్లో దైన్యం ఎక్కువ మాట్లాడడం లేదు. వున్నట్లుండి పెద్దదైపోయింది. గాంభీర్యం వచ్చింది. నాలుగైదు నెలలకు గానీ ఎక్కువగా బలం పుంజుకోలేదు.

'అతడిని గురించి ఆలోచిస్తున్నదా, ఎప్పుడేనా అడిగిందా" అని గోమతిని అడిగాను.

"లేదు అతనంటే దీనికి కోపం. పేరుకూడా సరిగ్గా తెలియని వాడిని ఏం తలచుకుంటుంది?" అన్నది.

సుమ ఫ్యాషన్ డిజైన్ కోర్సులో చేరింది. గోమతి చెల్లెలు పాపాయి ఫోటోలు కూడా పంపడం లేదు. నాకు ఎందుకో చూడాలని తహతహగా వుంది.

"చక్కగా వుందిట" అన్నది గోమతి ఒకసారి.

నేను నా సంసారం గొడవల్లో పడిపోయాను. ఎప్పుడోగానీ గోమతిని పలకరించడం లేదు. ఉన్నట్లుండి ఒకరోజు గోమతి ఫోన్ చేసింది.

"నువ్వోకసారి వస్తావా?" గోమతి కంఠం. మళ్ళీ ఏమొచ్చింది అని నోటి చివరిదాకా వచ్చింది నాకు. బాగుండదని తమాయించుకొని "చెప్పవే! ఏమిటి సంగతులు?" అన్నాను.

"సంగతే మరి! సుమ పెళ్ళి చేసుకుంటానంటోంది" అంది.

"శుభం! ఎవరిని?" అన్నాను.

"అదంతా చెబుతాను. పోనీ నేనే రానా?" అన్నది గోమతి.

"వద్దులే. నేనే వస్తాను. ఒక గంటలో" అన్నాను. నేను వెళ్ళాను.

"వాళ్ళ ఫ్యాషన్ డిజైన్ కోర్సులో ఒక లెక్చరర్ వచ్చారట. పంజాబీ-ఒకరికొకరం నచ్చాము అంటోంది. ఏమంటావు" అన్నది గోమతి. నేను జవాబివ్వడానికి సందేహించాను. ఎవరో అతను-తగినంత పరిచయం వుందా-ఆ కాశ్మీర్ వాడిని నమ్మినట్లుగానే యితడిని కూడా నమ్ముతుందా-కానీ సందేహాలు బయటపెడితే గోమతి ఏం అనుకుంటుందో, తన కూతురు చపలచిత్తురాలు అన్నాను అనుకుంటుందా!

"నువ్వు చూశావా అతడిని?" అన్నాను.

"ఆ-నేనూ, మా ఆయన యిద్దరం కలిశాం. బాగానే వున్నాడు" అన్నది. నీ బాగుండడం బంగారం కానూ అనుకున్నా మనసులో. దేశం కాని దేశం వాడు సుమని బాగా చూసుకుంటాడా? అతని కుటుంబం మాటో!

"ఎక్కడివాడు?" అన్నాను సాలోచనగా.

"ఢిల్లీ. అసలు సంగతి ఏమిటంటే అతనికి రెండో పెళ్ళి. భార్య పోయింది. ఒక కొడుకు ఉన్నాడట నాలుగేళ్ళవాడు. వాళ్ళ అమ్మ, నాన్న చూసుకుంటారుట. హర్యానాలో వుంటారుట.

అలాగా అనుకున్నా మనస్సులోనే. ఎందుకు పోయిందో భార్య ఎలా పోయిందో! నన్ను సలహా అడిగి నా మీద ఎంత భారం వేశావు తల్లీ అనుకున్నావా.

"ఏమంటావు జానకీ?" అన్నది.

అంత అర్జెంటుగా అడిగితే ఏం చెప్పగలను? నీరసపడ్డాను. "బాగా తెలుసా అతను సుమకి?"

"బాగా అంటే ఆర్నెల్లు పరిచయం. మనిషి మంచివాడట. ఢిల్లీలో తెలిసిన వాళ్ళు వున్నారులే విచారించుకోవచ్చు" అన్నది.

సుమ తన సంగతి చెబుతుందా? మగవాడికి ఒక పిల్లవాడు ఉండటం పెద్ద విషయమేమీ కాదు. రెండో పెళ్ళికి సిద్ధం కావడమూ మామూలే! కానీ ఆడపిల్లకు ఒక పిల్ల వుందంటే ఎంత మహాపచారం. ఎంత దారుణం. విపరీతంగా కలవరపడిపోతారు. పాపిగా పతితగా, దారి తప్పిన మనిషిగా చూస్తారు కదా!

"గోమతీ! సమ తన సంగతి చెబుతుందా అతనికి?"

గోమతి కళ్ళు పెద్దవి చేసింది. "ఇంకా నయం. చెబితే యింకేమైనా వుందా? సంబంధం తెగిపోతుంది. అసలు దానికి పెళ్ళి కావడమే కష్టం అనుకుంటే ఎవడో ముక్కు మొహం వున్నవాడు వస్తే చెడగొట్టుకుంటామా?" అన్నది.

గోమతి అనేదేమిటో అర్థమైనా కన్నకూతుర్ని అంత మాట అనేస్తోందే అనిపించింది.

"తన సంగతి చెప్పకపోతే పెళ్ళి ఎందుకు కాదు. దాచిపెట్టి వేరే లక్షణమైన సంబంధం చూడవచ్చు. అయినా, తన చదువు ఎందుకు ఆపించేశావు. ఆ బి.ఎ. పూర్తి చేయనీ. పాతికేళ్ళదాకా ఆగు. బాగా చదువుకోనీ. ఒక ఉద్యోగంలో స్థిరపడ్డాక పెళ్ళి మాట మాట్లాడు" అన్నాను.

గోమతి ఆలోచిస్తూ వుండిపోయింది.

"అదే చెప్పింది కదా. తనకి ఆ దృష్టి వుండబట్టే కదా ఆయనని పెళ్ళికొడుకుగా చూసింది. ఆయనా యిష్టపడ్డారు కదా! కాదంటే బాధపడుతుంది. కాలేజీకి వెళ్ళడానికి యిష్టపడడం లేదు. స్నేహితులందరితో ఏనాడో కటాఫ్ చేసింది. హఠాత్తుగా వెళ్ళిపోయి పదినెలలకి కనపడితే వాళ్ళు ఏమనుకుంటారు?" తన వాదన వినిపించింది గోమతి.

సుమ యింకా యింటికి రాలేదు. "అతనితో ఎక్కడికో వెళ్ళి వుంటుంది. జానకీ! అది ప్రేమలో పడింది. అతను కూడా చాలా అందమైన వాడు."

"గోమతీ, రహస్యంగా వుంచడం మంచిది కాదు. ఎప్పుడో అప్పుడు ఒక బలహీన క్షణంలో సుమ తానే చెప్పవచ్చు. అప్పుడు గోలైపోతుంది. ముందే చెప్పమను. అతని కొడుకు వాళ్ళ దగ్గర వుంటే, మన పిల్ల మీ చెల్లెలి దగ్గర వుంది. కానీ తమకి ఒక సంతానం వుంది అన్న విషయం యిద్దరూ మర్చిపోలేరు. కొంతకాలానికి పిల్లల మీద మనస్సు పుట్టి చేరదీసుకోవాలనిపించవచ్చు. భార్యాభర్తల మధ్య యింత పెద్ద విషయంలో దాపరికం ప్రమాదకరం" అన్నాను.

గోమతి ఆలోచనలో పడింది. నేను చెప్తే గాని అది పెద్ద విషయమని తనకి తోచలేదు. నాకంటే రెండేళ్ళు చిన్నది. చదువుకొన్నది. ఆ మాత్రం వూహించలేదా?

నాకు హఠాత్తుగా యీ వ్యవహారంలో ఆసక్తి పోయింది. నేనెందుకు అన్నిటికీ పుల్లలు పెడుతూ, చెడ్డదాన్ని కావాలి? వాళ్ళు ఎలాగో నిర్ణయించుకున్నారు. నా అంగీకారం కూడా వుంటే వాళ్ళవాదనకి బలం వస్తుంది. అంతే ఏదో మాటవరసకి అడుగుతోంది.

"అతను ఢిల్లీ, బొంబాయి, బెంగుళూరుల్లో పెద్ద ఫ్యాషన్ డిజైనర్‌ట. మిస్ యిండియాలకు కూడా డిజైన్ చేస్తాడట. అంత ఫేమస్ అయితే మనకీ బాగుంటుంది కదా?" అన్నది.

"అవును బాగుంటుంది" మరి కాస్సేపు కూర్చుని తానిచ్చిన కాఫీ తాగి యింటికి బయలుదేరాను. కొన్నాళ్ళు ఇంక నేనూ, తనూ మాట్లాడుకోలేదు.

"జానకీ! నీకో వార్త చెప్పవా?" అని మరో రోజు ఫోన్. "సుమ పెళ్ళి. దీపక్–అదే నీకు చెప్పిన పెళ్ళికొడుకు–ఢిల్లీలో చేసుకుందామన్నాడు. ఇక్కడ వీలుని బట్టి రిసెప్షన్" గోమతి చెప్పింది. నాలో ఒక్కటే ప్రశ్న. తను కన్నబిడ్డ గురించి చెప్పిందా? ప్రతిసారీ ఆ మాట అడగడం బాగుండదని తమాయించుకున్నాను. ఇంకా చిన్న వయస్సే. బాగా చదువుకోవాలనీ, ప్రయోజకురాలు కావాలని నేను చెప్పిన సలహా తల్లీ కూతుళ్ళిద్దరికీ నచ్చలేదన్నమాట.

వాళ్ళిష్టమొచ్చినట్లు జీవితాలు నడిపించుకోవడానికి మన సలహా ఎందుకడుగుతారు. మాటి మాటికీ అని నాకు అలక వచ్చింది.

"ఆహా! అల్లాగా శుభం" అన్నాను క్లుప్తంగా.

"షాపింగులకీ దానికి వెళ్ళాలి. ఆయనకేమో బొత్తిగా తీరుబాటు లేదు. సుమదంతా అయోమయం. నువ్వొస్తుండవే మధ్య మధ్య" అన్నది గోమతి. "సరే!" అన్నాను.

ఒక్క బిడ్డ. గారాలపట్టి. దాని పెళ్ళికి ఎంత ఖర్చు చేస్తే తనివితీరదేమో? అప్పటికే సుమకి నగలున్నాయి. మళ్ళీ రకరకాలు కొన్నది గోమతి. బట్టలైతే లెఖ్ఖలేదు. బాగుండదని ఒకటి, డిజైన్ నచ్చిందని ఒకటి, ఆ మాత్రం లేకపోతే ఎలా అని ఒకటే చీరెలు. డ్రెస్సులు ఢిల్లీ దర్జాకి తగ్గట్లు కొన్నది. "మిగిలినది అక్కడ తీసుకుంటుందిలే" అన్నది.

"నీకూ టిక్కెట్లు బుక్ చేయించేస్తాను" "వద్దు, వద్దు" అన్నాను కంగారుగా. వాళ్ళు విమానాల్లో తిరుగుతారు. నా మీద అంత ఖర్చు పెట్టడం యిష్టం లేదు. "ఇప్పుడే కాదు. ఇంట్లో అడిగి చెబుతాను" అన్నాను. తనూ బలవంతం చేయలేదు. ఇంకా పదిరోజుండగా "నాకు కుదరదని చెప్తూ "సుమ చెప్పిందా తన బిడ్డ విషయం" అని అడిగేశాను.

"చెప్పింది. అతను ఎంత బాగా చెప్పాడో తెలుసా. నా కొడుకు, నీ కూతురు కలిసి మన పిల్లలతో ఆడుకుంటారు అన్నాడట" పాత ఇంగ్లీష్ జోక్ గుర్తుకి వచ్చింది.

వాళ్ళు ఢిల్లీ వెళ్ళి, పెళ్ళి జరిపించుకొని వచ్చేలోపు మాకు అర్జెంటుగా ట్రాన్స్ఫర్ అయ్యి, రిలీవ్ అయిపోవలసి వచ్చింది. గోమతిని, ముఖ్యంగా సుమని చూడకుండా వెడుతున్నానని బాధనిపించింది. స్నేహాలూ, బంధాలు అన్నీ దగ్గర వుంటేనే, దూరం వెడితే ఎవరికి ఎవరో? ఆడవాళ్ళకి అందులోనూ స్వేచ్ఛ తక్కువ. ఎక్కడ వుండాలో, ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలో మగవాళ్ళ నిర్దేశిస్తారు. నాకూ అలాగే జరిగింది. ఏడెనిమిదేళ్ళు అండమాన్స్‌లో వుండిపోయాను. ఎప్పుడో ఒక వుత్తరం. ఒక ఫోన్‌కాల్. చిన్ననాడు చెట్టపట్టాలేసుకుని తిరిగేవాళ్ళం. ఆడుకునేవాళ్ళం. కాలేజీలో ఒకే బెంచి మీద కూర్చునేవాళ్ళం. పెళ్ళయినా ఒకే వూళ్ళో వుండి కలుసుకునేవాళ్ళం. ఆ స్నేహం అంతా మరుగున పడిపోయింది. ఎవరి బతుకులు, ఎవరి సమస్యలు వారివి. గోమతితో నాకు ఒక మరువలేని అనుబంధం. అది తెగిపోయింది.

"పెద్దమ్మా! అమ్మ డైడ్ టూ వీక్స్ ఎగో – మాసివ్ హార్ట్ ఎటాక్" ఉత్తరం వచ్చింది సుమ దగ్గర్నుంచి.

నాకు ముందు విషయం అర్థం కాలేదు. తరువాత తెలిసింది. గోమతి చచ్చిపోయింది – శాశ్వతంగా నాకు కనిపించకుండా పోయింది. గచ్చకాయలు, చింతపిక్కలు ఆడుకుంటూ, పూలజడలు వేసుకొని, తెల్లవారేవరకు ఎవరిది నలిగి పోకుండా వుంటుందా అని పోటీలు పడేవాళ్ళం. ఆ గోమతి చచ్చిపోయింది. భోరున ఏడ్చాను. కడుపులో నుంచి తెలరలు తెరలుగా దుఃఖం వచ్చింది. "చెప్పకుండా వెళ్ళిపోయావు. నువ్వొక్కసారి వస్తావా? అని ప్రతి చిన్న విషయానికీ అడిగేదానివి. ఈసారి నన్ను రమ్మనే వ్యవధి లేకపోయిందా నీకు? అని ప్రశ్నలతో తల బద్దలు కొట్టుకున్నా.

"సుమా! ఏం జరిగింది?" అని ఫోన్ చేశాను. వివరంగా చెప్పింది. ఏది ఏమైన పర్యవసానం ఒక్కటే.

"నేను యీ వూళ్ళోనే వున్నాను పెద్దమ్మా! మా ఆయనకి యిక్కడే వుద్యోగం. పిల్లలూ, నేను అంతా యిక్కడే వున్నాం, నాన్నని చూసుకుంటూ. అన్నకి పెళ్ళయింది. ఆస్ట్రేలియా వెళ్ళాడు."

పదేళ్ళకు మళ్ళీ అదే వూరు వెళ్ళాను. సామానైనా సర్దుకోకుండా గోమతి యింటికి వెళ్ళాను. సాయంత్రం నాలుగు. ఎండ పడుతోంది ఆ యింటి మీద.

పూలూ, తీగెలు అన్నీ అల్లాగే వున్నాయి. పచ్చని ఆకులు దట్టంగా వున్నాయి. కానీ, ఆ పచ్చదనంలో నాకు విషాదం కనిపించింది. కదలని ఆకుల్లో నా స్నేహితురాలు వుంది.

"పెద్దమ్మా! అని కౌగలించుకుంది సుమ. ఎంతో సేపు ఏడిచింది. నేను వీపుమీద చేయివేసి నిమురుతున్నాను. గోమతి నిలువెత్తు ఫోటో నవ్వుతూ మమ్మల్ని చూస్తోంది.

సుమ దుఃఖం ఒకరు తీర్చేది కాదు. బిలబిలలాడుతూ ముగ్గురు పిల్లలు స్కూలు నుంచి వచ్చారు. ఆ పాప–ఆ పాపని చూడాలని నాకు. తేరిపార చూస్తున్నాను ఆ పాప వంక. కళ్ళు ఇంద్ర నీలాలలు. గులాబీ మొగ్గ ఆ నోరు. వెన్నెల పరచినట్లున్న చెంపలు. సన్నని లతలా – ఎంత బాగుంది ఆ పాప.

నేను అలా చూడడం గమనించింది. నవ్వింది. ఇద్దరూ అబ్బాయిలు. పిల్లలు ముగ్గురూ ఆడుకుంటున్నారు. ఆ అందాల భరిణనా లోకంలోకి రాకుండా చేస్తానన్నది గోమతి? ఉంగరాల జుట్టు ముఖం మీద పడుతుంటే వాళ్ళ అమ్మ వెనక దాక్కుంది.

"పేరు శకుంతల. గులాబీ అని పిలుస్తాం" అన్నది సుమ.

గులాబీయే, సుకుమారాల దొంతర యీ పాప గులాబీ! నేను రక్షించిన, నేను స్వాగతించిన, నా కారణంగా యీ లోకంలో కళ్ళు విప్పిన తేనెల సోన యీ బాల. నేను అవాక్కయ్యాను. గోమతిని పోగొట్టుకున్న దుఃఖం ఎటో అట్టడుగుకి జారిపోయింది. ఆ తల్లీ బిడ్డల కౌగిలింత ఒక కమనీయ దృశ్యం. నా కడుపు నిండింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సుమ ఏదో తినడానికి పెట్టింది. దీపక్ వచ్చే వరకు వుండమనంది. 'వూళ్ళోనే వుంటాగా, చూస్తాలే' అని బయలుదేరాను. డ్రైవర్‌ని పిలిచి సాగనంపింది.

గుమ్మంలో నా చేయి గట్టిగా పట్టుకుంది "పెద్దమ్మా థాంక్యూ" అన్నది. కళ్ళ వెంట జలజలా ముత్యాలు రాలాయి.